

వీరత్వానికి ప్రతీక శివాజీ

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని హిందూవాహిని ధర్మ ప్రచారక్ డా.ఆదిత్యపరాశ్రీస్వామి అన్నారు. 8లో▸



ఆకట్టుకున్న ఆహ్లాదం

కోట్‌పల్లి ప్రాజెక్టుకు జనాల తాకిడి పెరిగింది. ఆదివారం వేలాది మంది పర్యాటకులు వచ్చి సేదా తీరారు. 8లో▸



బస్ చార్జీల మోత

హిందూ పండుగలకు బస్ చార్జీలు పెంచడం విడ్డూరంగా ఉందని జీసీ మోర్చా నాయకుడు శ్రీకాంత్ మండిపడ్డారు. 9లో▸

న్యూస్‌రీల్

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా శ్రీశైలం

మండల అధ్యక్షుడిగా రాఘవేందర్



శ్రీశైలం, రాఘవేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

పూడూరు: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మండల కేంద్రానికి చెందిన శ్రీశైలం నియమిస్తూ కోకట్ మాధవరెడ్డి ఉత్తర్వులు వెల్లడించారు. ఈ మేరకు పార్టీ నాయకులు మండల పరిధిలోని మన్నెగూడలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్ మాట్లాడుతూ.. పార్టీలో పనిచేసే ప్రతీ ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం రెండోసారి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన రాఘవేందర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, పార్టీ నాయకులు వెంకటయ్య, జంగయ్య, అనంతరాములు, కృష్ణ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్మీదేవిపల్లి'కి త్వరలో భూసేకరణ

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




గురుకుల పాఠశాలల ప్రవేశాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క తదితరులు


షాద్‌నగర్‌రూరల్: పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించ తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం త్వరలో భూసేకరణ చేయనుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనకు వెళ్తున్న ఆయనతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవికి షాద్‌నగర్ పట్టణ బైపాస్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి వారికి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ.. బీడుగా మారిన పంట పొలాలకు నీళ్లు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం గురుకుల పాఠశాలల ప్రవేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాబర్‌ఖాన్, విశ్వం, కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, రఘు నాయక్, బాల్‌రాజ్‌గౌడ్, ఖదీర్, పాల్గొన్నారు.

ట్రిబుల్ ఆర్.. రూట్ క్లియర్

- దక్షిణ రింగుపై తొలగిన సందిగ్ధత
- పాత డీపీఆర్‌కు స్వల్ప మార్పులు
- కొత్త డీపీఆర్‌కు కేంద్రం అంగీకారం
- నూతన డీపీఆర్ తయారీకి టెండర్లు



రీజనల్ రింగ్‌రోడ్డు కొత్త ప్రతిపాదిత నమూనా



వికారాబాద్: జిల్లా మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిబుల్ ఆర్) అలైన్‌మెంట్ దాదాపు ఖరారయినట్లే. పడమర, దక్షిణ భాగాలను కలుపుతూ నిర్మించే దక్షిణ రింగు ఎవరు నిర్మించాలనే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అభిప్రాయ బేధాలతో సందిగ్ధత నెలకొన్న విషయం విదితమే. దక్షిణ, పడమర భాగాలను కలుపుతూ 189 కిలో మీటర్ల పొడవుతో కేంద్రం ఇప్పటికే డీపీఆర్ తయారు చేయించింది. కాగా పడమర ప్రాంతంలో రీజనల్ రింగ్‌రోడ్డు హైదరాబాద్‌కు 45 నుంచి 50 కిలోమీటర్ల దూరం నుంచి రంగారెడ్డి జిల్లాకే పరిమితం చేస్తూ మొదటి డీపీఆర్ తయారు చేశారు. దీంతో రీజనల్ రింగ్‌రోడ్డు జిల్లా మీదుగా ఉంటుందా..? లేదా..? అనే విషయంలో కొంత కాలంగా జిల్లా ప్రజల్లో చర్చ జరుగుతూ వస్తోంది. ఇదే సమయంలో తూర్పు, ఉత్తర, దక్షిణ ప్రాంతాలతో పోలిస్తే మన జిల్లా సరిహద్దు కలిగి ఉన్న పడమర ప్రాంతంలో రీజనల్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు తక్కువ దూరం నుంచి నిర్మిస్తున్నారని జిల్లా నేతలు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు. మిగతా భాగాల్లో హైదరాబాద్‌కు 60 నుంచి 90 కిలోమీటర్ల దూరం నుంచి ట్రిబుల్ ఆర్ నిర్మించేలా అలైన్‌మెంట్ తయారు చేయగా మన జిల్లాను కలుపుతూ వెళ్లే పడమర ప్రాంతంలో 50 కిలోమీటర్ల దూరం నుంచే వెళ్లేలా అలైన్‌మెంట్ తయారు చేశారు. దీంతో పశ్చిమ ప్రాంతాన ఉన్న మన జిల్లాకు అన్యాయం జరుగుతుందని.. జిల్లా అభివృద్ధికి గండిపడే ప్రమాదముందని జిల్లా వాసులు, నేతలు ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు.

200 కిలోమీటర్ల మేరకు పెరిగిన డీపీఆర్

ట్రిబుల్ ఆర్ పాత అలైన్‌మెంట్‌తో జిల్లాకు అన్యాయం జరుగుతుందనే విషయం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కాగా సీఎం ఆధ్వర్యంలో ఆగస్టులో నిర్వహించిన ఉన్నతాధికారుల సమావేశంలో ట్రిబుల్ ఆర్‌పై నిర్వహించిన చర్చలో పడమర భాగం అలైన్‌మెంట్ మార్పు విషయం తెరపైకి వచ్చింది. వికారాబాద్ జిల్లాను కలుపుతూ వెళ్లేలా అలైన్‌మెంట్ మార్చాలని అధికారులకు సూచించించారు. ఈ మేరకు అలైన్‌మెంటు మారుస్తూ ఎక్స్‌ప్రెస్ వే అథారిటీకి ప్రతిపాదనలు పంపించారు. కాగా గతంలో పాత అలైన్‌మెంట్ ప్రకారం కేంద్రం తయారు చేసిన దక్షిణ రింగు డీపీఆర్ 189 కిలోమీటర్ల పొడవుతో తయారు చేశారు. అయితే పడమర వికారాబాద్ జిల్లాను కలుపుతూ సీఎం చేసిన నూతన ప్రతిపాదనల ప్రకారం దక్షిణ రింగు పొడవు 200 కిలోమీటర్లకు పెరిగింది. దీంతో అదనపు భారం పడే అవకాశం ఉన్నందున కేంద్రం ఇలా అయితే తాము దక్షణ రింగు నిర్మించబోమని చెప్పటంతో సందిగ్ధత నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలుగజేసుకుని కేంద్రం నిర్మించకుంటే ఉత్తర రింగు చేపట్టే సమంలోనే దక్షిణ రింగురోడ్డు రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుందని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు దక్షిణ రింగు సైతం తామే నిర్మిస్తామని సూత్రప్రాయంగా అంగీకరించింది. కొత్త డీపీఆర్ తయారుకు టెండర్లు పిలిచేందుకు నోటిఫికేషన్ జారీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ టెండర్లు వేసేందుకు ఫిబ్రవరి 9 వరకు గడువు ఇవ్వనున్నట్లు సమాచారం.

> ### జిల్లా మీదుగానే రీజినల్ రింగురోడ్డు
>
> 
>
> గతంలో రూపొందించిన ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ విషయంలో పశ్చిమ భాగానికి అన్యాయం జరుగుతోందని ఆందోళన చేపట్టాం. ఈ విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రితో చర్చించా. ట్రిబుల్ ఆర్ జిల్లా మీదుగా వెళ్లేలా కొత్త ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. ఇదే అలైన్‌మెంట్ ఫైనల్ అయ్యేలా చూస్తాం. తాజాగా కేంద్రం సైతం ఆమోదం తెలపడం శుభపరిణామం. కేంద్రం అంగీకరించకుంటే రాష్ట్ర ప్రభుత్వమే నూతన ప్రతిపాదనల ప్రకారం నిర్మించేందుకు సిద్ధంగా ఉంది.
>
> – టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

కొత్త ప్రతిపాదనలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

గతంలో తయారు చేసిన డీపీఆర్‌లో పొందుపరిచిన అలైన్‌మెంట్‌లో పడమరలో మన జిల్లా సరిహద్దు ప్రాంతమైన రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆలూరు–కొకుంట్ల గ్రామాల మధ్య నుంచి తంగెడుపల్లి మీదుగా వెళ్లేలా ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనల్లో వికారాబాద్ జిల్లాకు చెందిన పూడూరు, నవాబుపేట మండలాలకు చెందిన ఒకటి రెండు గ్రామాల రెవెన్యూ పరిధి నుంచి ట్రిబుల్ ఆర్ వెళ్లేలా డిజైన్ చేశారు. కాగా తాజా ప్రతిపాదనల్లో జిల్లా పరిధిలోని నాలుగు మండలాలను కలుపుతూ నూతన అలైన్‌మెంట్ తయారు చేశారు. పూడూరు, నవాబుపేట మండలాల పరిధిలోని పదికి పైగా గ్రామాలు రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలోకి వస్తున్నాయి. వికారాబాద్, మోమిన్‌పేట మండలాల పరిధిలోని రెండు మూడు గ్రామాలను కలుపుతూ వెళ్లేలా ఈ కొత్త ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి పంపగా కేంద్ర ప్రభుత్వం తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం.

గొంగుపల్లిలో తేనీటి విందు



గొంగుపల్లి సమీపంలో నవాబ్ ఆలంఖాన్ తేనీటి విందు ఇచ్చారు. ఆదివారం సాయంత్రం ఇచ్చిన ఈ విందులో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు పాల్గొన్నారు. – పూడూరు

అర్హులను గుర్తించండి

- ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ, వార్డు సభలకు ఏర్పాట్లు
- క్షేత్ర స్థాయిలో సేకరించిన వివరాలు, గ్రామ సభ తీర్మానాలు భద్రపరచాలి
- జూమ్ మీటింగ్‌లో అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి ఈ నెల 21 నుంచి 24 వరకు పంచాయతీల పరిధిలో గ్రామ సభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డు సభలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26 నుంచి పథకాలు అందించేందుకు ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో.. చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఆదివారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ జూమ్ మీటింగ్‌లో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం పట్టాపాస్ పుస్తకాలు కలిగిన రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లకు గాను ప్రతీ ఏడాది ఎకరానికి రూ.12 వేల చొప్పున నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేయనుందని తెలిపారు. భూ భారతి(ధరణి)పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూ విస్తీర్ణం ఆధారంగా రైతు భరోసా పథకం కింద అర్హులైన వారిని గుర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయి సందర్శన చేసి భూమి వ్యవసాయానికి యోగ్యమైనదా? కాదా? అన్నది నిర్ధారించాలన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసుకోవాలని.. గ్రామ స్థాయిలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రెవెన్యూ అధికారులతో కమిటీలను నియమించుకుని విలేజ్ మ్యాప్, గూగుల్ మ్యాప్ ఆధారంగా వ్యవసాయ యోగ్యమైన భూములను నిర్ధారించాలని సూచించారు. ఈ నెల 20 లోపు క్షేత్ర స్థాయి సందర్శన ప్రక్రియను పూర్తి చేయాలని గడువు విధించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో వివరాలను వెల్లడిస్తూ.. గ్రామసభ ఆమోదం పొందిన తర్వాత సంబంధిత పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు.



జూమ్ మీటింగ్ లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

20 రోజుల ఉపాధిహామీ పనులు తప్పనిసరి

సాగు భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు సాలీనా రూ.12వేలు అందించేందుకు ఉద్దేశించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుసరిస్తూ జిల్లాలో అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించాలన్నారు. 2023–24లో కనీసం 20 రోజుల పాటు ఉపాధి హామీ పనులు చేసిన వ్యవసాయ కూలీ కుటుంబాలు ఆత్మీయ భరోసా పథకానికి అర్హులని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. లబ్ధిదారుల గుర్తింపులో ఎంపీడీఓలు, ఏపీఓలు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. కొత్త ఆహార భద్రత (రేషన్) కార్డులు జారీ చేసే విషయంలోనూ క్షేత్రస్థాయి పరిశీలన చేయానలి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి తలసరి ఆదాయం, భూమి ఉన్న కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను అందించడంతో పాటు, పాత కార్డులలో మార్పులు చేర్పులను సైతం చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఎక్కడ డూప్లికేట్, డబుల్ రేషన్ కార్డులు జారీ కాకుండా పకడ్బందీ పరిశీలన చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుసరించాలన్నారు. గ్రామ సభల్లో ఇందిరమ్మ కమిటీల ప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నారు. విమర్శలకు తావు లేకుండా అర్హులైన వారికి లబ్ధి చేకూరేలా చొరవ చూపాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను, గ్రామ సభలు గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలు, గ్రామసభల్లో చేసిన తీర్మానాలను భద్రపరచాలని సూచించారు. గ్రామసభల నిర్వహణకు రెండు రోజుల ముందుగానే సంబంధిత గ్రామాలు, వార్డుల ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డీఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ.. రుణం పెరిగి



- రూ.60 కోట్ల అప్పుల్లో మదర్ డెయిరీ
- పాడి రైతులకు రూ.20 కోట్ల బకాయి
- రెండు బ్యాంకుల్లో రూ.35 కోట్ల రుణాలు
- వడ్డీ కట్టేందుకే ఏటా కోట్ల రూపాయలు
- పరికరాల కొనుగోలు బాకీలు రూ.5 కోట్లు
- చెల్లించలేక ఆస్తుల అమ్మకానికి సిద్ధం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నల్లగొండ–రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్ (నార్ముల్ మదర్ డెయిరీ) రూ.60 కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. భారీగా పేరుకుపోయిన అప్పులను తీర్చేందుకు ఆస్తులు విక్రయించాలని నిర్ణయించింది. పరిపాలన పరమైన ఆమోదం పొందేందుకు ఫిబ్రవరి 7న సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసింది. హయత్‌నగర్ మదర్ డెయిరీ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం అధ్యక్షులంతా హాజరు కావాల్సిందిగా కోరింది. తీర్మానం ఆమోదం పొందడమే ఆలస్యం .. ఆస్తులు అమ్మి అప్పులు తీర్చనుంది.

కర్షుడి చావుకి అనేక కారణాలన్నట్లు..

నార్ముల్ మదర్ డెయిరీ రెండు జిల్లాల్లోని 24 చిల్లింగ్ కేంద్రాల నుంచి 98 వేల మంది రైతుల నుంచి రోజుకు సుమారు లక్ష లీటర్ల పాలు సేకరిస్తోంది. వీటిలో 65 వేల లీటర్లను బహిరంగ మార్కెట్లో విక్రయిస్తుండగా, మరో 35 వేల లీటర్ల పాలను పౌడర్, పెరుగుగా మారుస్తోంది. ప్రైవేటు డెయిరీల నుంచి పోటీ పెరగడం, నార్ముల్ మదర్ డెయిరీ బ్రాండ్ ప్రమోటింగ్ కోసం అధిక వ్యయం వెచ్చించడం, సేకరణ కంటే విక్రయాలు తక్కువగా ఉండటం, మిలిగిన పాలను పౌడర్‌గా మార్చే ప్రక్రియలో భాగంగా లీటరుకు రూ.15 చొప్పున నష్టపోతుండటం, కోవిడ్ సమయంలో పాల అమ్మకాలు విపరీతంగా తగ్గిపోవడం.. ప్రభుత్వ ఏజెన్సీల నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడం, పరిపాలన పరమైన ఖర్చులు అధిక మవడంతో నిర్వహణ ఖర్చుల కోసం యాక్సిస్, ఎన్‌డీడీబీల నుంచి రూ.35 కోట్లు అప్పు తీసుకుంది. ఈ రుణాలకు ఏటా రూ.4 కోట్ల చొప్పున వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. అంతేకాదు కన్స్యూమబుల్స్, పరికరాల కొనుగోలు పేరుతో వివిధ సంస్థలకు రూ.5 కోట్లు బకాయి పడింది. ఫలితంగా అప్పు కాస్త రూ.60 కోట్లకు చేరింది. ఆర్థిక సంక్షోభం కారణంగా పాలు పోసిన రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించలేని పరిస్థితి. నిజానికి ప్రతి పదిహేను రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం నవంబర్, డిసెంబర్ సహా జనవరి 15 రోజులకు సంబంధించిన బిల్లులు కూడా చెల్లించలేదు. ఇలా ఇప్పటి వరకు రైతులకు రూ.20 కోట్లు బకాయి పడింది.

అమ్మకానికి 30.5 ఎకరాల భూమి

చెల్లింపులు యూనియన్‌కు భారంగా మారడంతో ఆస్తులు అమ్మి అప్పులు తీర్చాలని భావిస్తోంది. పాలసేకరణ, అమ్మకాల ద్వారా వచ్చిన లాభాలతో 2003లో నల్లగొండ జిల్లా చిట్యాల వద్ద 29 ఎకరాల భూమి సహా మిర్యాలగూడలో 1.5 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. సంస్థకు భారంగా మారిన ఈ అప్పులు తీర్చాలంటే ఆస్తుల అమ్మకం ఒక్కటే పరిష్కార మార్గమని భావించింది. భూమిని విక్రయించగా వచ్చిన సొమ్ముతో అప్పులు చెల్లించాలని నిర్ణయించింది. ఆ మేరకు తీర్మానం ఆమోదం కోసం వచ్చే నెలలో సమావేశం ఏర్పాటు చేయడం కొసమెరుపు.

ఇచ్చేదే లే!

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం సర్వే



సర్వే పనులను అడ్డగిస్తున్న ఎక్వాయిపల్లి గ్రామస్తులు (ఫైల్)

- ఎక్కడికక్కడ అడ్డుతగులుతున్న రైతులు
- భూములిచ్చేందుకు ససేమిరా
- ఎలా బతకాలని ఆవేదన
- బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్
- నచ్చజెప్పే ప్రయత్నంలో రెవెన్యూ అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఔటర్ నుంచి ఆకుతోటపల్లి వరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన 330 ఫీట్ల ఎలివేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూసేకరణ అంశం వివాదాస్పదంగా మారుతోంది. నష్టపరిహారాన్ని తేల్చకుండా, కనీసం రైతులకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం ఏకపక్షంగా భూములను నోటిఫై చేసి, ఆ మేరకు సర్వే పనులు మొదలు పెట్టడాన్ని రైతులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. సర్వే కోసం వచ్చిన అధికారులను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో పోలీసుల భద్రత మధ్య సర్వే పనులు చేపట్టాల్సి వస్తోంది. ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ నంబర్ 13 నుంచి ఆమనగల్లు సమీపంలోని ఆకు తోటపల్లి వరకు 41.5 కిలోమీటర్ల రోడ్డుకు 4,725 మంది రైతుల నుంచి 1,004.22 ఎకరాల భూమిని సేకరిస్తున్న విషయం తెలిసిందే. బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలకు.. ప్రభుత్వం చెల్లిస్తున్న పరిహారానికి పొంతన లేకపోవడంతో మెజార్టీ రైతులు తమ భూములు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. కొంత మంది భూమికి బదులుగా భూమి కోరుతుండగా.. మరికొంత మంది ఎకరానికి కనీసం రూ.రెండు కోట్లు అయినా ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నా అంగీకరించడం లేదు.

పరిహారం ఇస్తామన్నా ససేమిరా..

ఫార్మాసిటీ కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లోని పది గ్రామాల్లో 19,333 ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. 2017 నుంచి 2024 వరకు 13,500 ఎకరాలు సేకరించింది. మొదట్లో ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులకు ఎకరానికి రూ.7.70 లక్షలు, అసైన్డ్ పట్టాదారులకు రూ.8 లక్షలు, పట్టా భూములకు రూ.12.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించింది. రైతుల ఆందోళనలతో రూ.16 లక్షలకు పెంచింది. మీర్‌ఖాన్‌పేటలో టీజీఐఐసీ వెంచర్‌లో ఎకరానికి 121 గజాల చొప్పున ప్లాట్లకు ప్రొసీడింగ్స్ ఇచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓటమి పాలవడం.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. ఫార్మాసిటీ స్థానంలో ఫ్యూచర్‌సిటీని ప్రతిపాదించడం చకచకా జరిగిపోయాయి. ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డుకు సంకల్పించారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.25 లక్షలు పరిహారం చెల్లించనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వ మార్కెట్ వాల్యూపై నాలుగు రెట్లు అదనంగా పరిహారం పెంచినప్పటికీ రైతులు భూములిచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. కొన్ని చోట్ల రెండు పంటలు పండుతుంటే, మరికొన్ని చోట్ల మూడు పంటలు పండే భూములు ఉన్నాయి. ఏళ్లుగా ఈ భూములనే నమ్ముకుని జీవిస్తున్న వాళ్లు.. ఉన్నపళంగా వదులుకోవాల్సి వస్తుండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

ఫేజ్–1లో భూ సేకరణ

మండలం	గ్రామం	రైతులు	భూమి(ఎకరాల్లో)
ఇబ్రహీంపట్నం	ఫిరోజ్‌గూడ	84	1.03
ఇబ్రహీంపట్నం	కొంగరకలాన్	361	55.05
మహేశ్వరం	కొంగరకుర్దు	278	53.20
కందుకూరు	లేమూరు	497	84.28
కందుకూరు	తిమ్మాపూర్	290	47.02
కందుకూరు	రాచలూరు	351	87.22
కందుకూరు	గుమ్మడవెల్లి	(రిజర్వుడ్ ఫారెస్ట్)	32.11
కందుకూరు	పంజాగూడ	(టీఎస్ఐఐసీ)	18.33
కందుకూరు	మీర్‌ఖాన్‌పేట	48	62.08

ఫేజ్–2లో భూ సేకరణ

మండలం	గ్రామం	రైతులు	భూమి (ఎకరాల్లో)
ఆమనగల్లు	ఆమనగల్లు	331	68.35
ఆమనగల్లు	ఆకుతోటపల్లి	229	83.35
యాచారం	కుర్మిద్ద	529	144.75
కడ్తాల్	కడ్తాల్	440	72.67
కడ్తాల్	ముద్విన్	1287	184.76

> ### భూమికి బదులు భూమి
>
> కుర్మిద్ద రెవెన్యూలో వ్యవసాయ భూమి ఉంది. సర్వే నంబర్ 286, 287లో మొత్తం రెండు ఎకరాలు పోతుంది. ఏళ్లుగా ఆ భూమినే నమ్ముకుని జీవిస్తున్నా. భూమి పోతే మా జీవితాలు నాశనమైనట్లే. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు తీసుకునే భూమికి గాను కుర్మిద్ద గ్రామ రెవెన్యూ పరిధిలోనే భూమి ఇవ్వాలి.
>
> – నేనావత్ పంత్య, రైతు, మంగలిగడ్డతండా

రూ.కోటి పరిహారం ఇవ్వాలి

సర్వే నంబర్ 311లో నా భూమి ఉంది. ఇదే నంబర్ నుంచి గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వెళ్తుంది. మాకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా సర్వే చేశారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారాన్ని తేల్చకుండా నోటిఫై ఎలా చేస్తారు. ఎకరానికి రూ.కోటి పరిహారం చెల్లించిన తర్వాతే భూములు తీసుకోవాలి.

– కరుణాకర్ గౌడ్, ఎక్వాయిపల్లి

క్లుప్తంగా

నేడు ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవ్

కుల్కచర్ల: తమ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి ఉత్సవ్ నిర్వహిస్తామని ఆర్‌ఎస్‌ఎస్ ఖండ బౌద్ధిక్ ప్రముఖ్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో సాయంత్రం కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ వేద పండితులు జోషిజనార్ద నాచార్యులు, అఖిల భారత కార్యకారిణి సభ్యులు భాగయ్య, ఖండ సంఘ చాలక్ ఎల్లయ్య హాజరవుతారని తెలిపారు. హిందువులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు.

ఊరెళ్లే ముందు సమాచారమివ్వాలి

ఎస్‌ఐ సత్యనారాయణ



కొడంగల్ రూరల్: పండగలకు ఊరెళ్తున్న క్రమంలో ఇంటి యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ జీవి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఇంటి భద్రతపై పలు సూచనలు అందించారు. ఇంట్లో విలువైన వస్తువులు ఉంచకుండా లాకర్లలో పెట్టుకోవాలని, ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేస్తున్నాయో లేదో గమనిస్తూ ఉండాలన్నారు. ఇంటి ముందు నిత్యం శుభ్రం చేసేలా పనివారికి తెలియజేయాలన్నారు. ఇంటి ఆవరణలో దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, ఊరెళ్లే ముందు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శివకుమార్



యాలాల: బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా దేవనూరు గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల శివకుమార్ ఆదివారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రమేశ్‌కుమార్, మండల ఇన్‌చార్జి బాలి శివకుమార్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షుడిగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళాన్ని అందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కుల్కచర్ల: దేవాలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని జేసీఐ సంస్థ జిల్లా ప్రెసిడెంట్ చెదురుపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల పరిధిలోని ఘణపూర్‌లో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి ఆయన రూ.51వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని కాపాడుకోవడానికి హిందువులందరూ సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో పీఎన్‌పీఎస్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, నాయకులు రాఘవేంద్ర చారి, గోపాల్, వెంకటయ్య, పాల్గొన్నారు.

బిస్కెట్ పరిశ్రమలో తనిఖీలు

నందిగామ: మండల పరిధిలోని మేకగూడ శివారులో ఇటీవల ఓ బిస్కెట్ పరిశ్రమలో ఆహార భద్రత అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే కాలం చెల్లిన వస్తువులతో బేకరీ పదార్థాలు, బిస్కెట్లు తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు ఆలస్యంగా ఆదివారం తెలిసింది. వీటి విలువ సుమారు రూ.14లక్షల వరకు ఉంటుందని సమాచారం. పరిశ్రమలో తనిఖీలు నిర్వహించిన విషయాన్ని అధికారులు ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



సీజ్ చేసిన ట్రాక్టర్

షాద్‌నగర్: కేశంపేట మండలం కాకునూరు గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు సీఐ నరహరి తెలిపారు. శనివారం అర్ధరాత్రి కాకునూరు గ్రామ శివారులో ఉన్న వాగు నుంచి అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్నారు. అదే సమయంలో గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అక్రమంగా తరలిస్తున్న ఇసుకను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కానిస్టేబుల్ శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

సంక్రాంతి.. సకలం ప్రాప్తి

- గ్రామాల్లో సందడి వాతావరణం
- ముగ్గుల పోటీల్లో యువతులు
- గాలిపటాలతో చిన్నారుల కేరింతలు



గంగిరెద్దు ఆట (ఫైల్)



సంకెపల్లిగూడలో ఓ ఇంటి ముందు ముగ్గులు



షాబాద్‌లో ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు

షాబాద్: ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, పాకశాలలో గుమగుమలాడే పిండి వంటకాలు, ఆకాశంలో చక్కర్లు కొట్టే పంతగులు(గాలిపటాలు), హరిదాసుల విన్యాసాలు... ఇవీ సంక్రాంతి అనగానే మన కళ్ల ముందు కదలాడే చిత్రాలు. తెలుగువారే ప్రత్యేకంగా ఈ పండుగను ఇంటిల్లిపాది ఆనందోత్సవంతో నిర్వహించుకుంటారు. రంగారెడ్డి జిల్లాలో వైభవంగా సంక్రాంతి పర్వదినాన్ని జరుపుకొంటారు. హైదరాబాద్‌కు చేరువలో ఉండడంతో పంతగుల ఎగురవేత ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఖాళీ ప్రదేశాల్లో గాలిపటాలు పెద్ద ఎత్తున ఎగరేస్తారు. పండుగకు మూడు రోజుల ముందుగానే ప్రతి వాకిలి ముగ్గులతో కళకళలాడుతూ ఉంటుంది. ముంగిట ముగ్గులు ఉంటే లక్ష్మీదేవికి ప్రీతికరం అని ప్రజల విశ్వాసం. స్త్రీల సృజనాత్మకత, కళాతృష్ణకు ప్రతీకలుగా రంగవల్లులు పేర్కొనవచ్చు. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పాటు ఊరూవాడ సంబరాలు అంబరాన్నంటుతాయి. పలుచోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించారు.

షాక్ కొడుతున్న ధరలు

సంక్రాంతి పండుగ మర్నాడు కనుమ పండుగను చేసుకుంటారు. పశువులు, కోడె దూడలను అలంకరించి, భక్షాలు తినిపించి మూగజీవాలపై ప్రేమను చాటుకుంటారు. కనుమ నాడు ఇంటికి వచ్చిన కూతుళ్లు, ఆడపడుచులను ప్రయాణాలు చేయనివ్వరు. సంక్రాంతి సందడిలో ఏడాది కోసారి వచ్చే విశిష్ట అతిథి డూడూ బసవన్నల విన్యాసాలకు వన్నె తగ్గింది. పండగవేళ ఏది కొందామన్న ధరలు షాక్ కొడుతున్నాయి. నూనెలు, పిండి, పంతగుల ధరలు గతేడాదితో పోల్చితే విపరీతంగా పెరిగాయి. సామాన్యులు పండుగవేళ అవస్థలు పడుతున్నారు. పతంగుల విషయంలో చైనా మాంజాలతో జాగ్రత్తగా ఉండాలి. బైక్‌పై ప్రయాణం చేసేటప్పుడు మాంజా తగిలితే కోసే ప్రమాదం పొంచి ఉంది. పెద్దలు ఎప్పుడూ చిన్నారులను పర్యవేక్షిస్తుండాలి.

చిగురించిన ఆప్యాయతలు



వికారాబాద్‌లో పతంగుల విక్రయాలు

దుద్యాల్: గ్రామాల్లో సంక్రాంతి సందడి ముందుగానే మొదలైంది. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో ఇతర ప్రాంతాల్లో చదువుతున్న వారందరూ ఇళ్లకు చేరుకున్నారు. నూతనంగా పెళ్లిళ్లు చేసిన వారి కుటుంబాల్లో కూతుర్లు, అల్లుళ్లతో కోలాహలం నెలకొంది. బతుకుదెరువు కోసం హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాలకు వెళ్లిన వారు గ్రామాలకు చేరుకోవడంతో ఆప్యాయతలు చిగురించాయి. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆహ్లాద వాతావరణంలో సంక్రాంతిని నిర్వహించనున్నారు. మొదటి రోజు భోగి సందర్భంగా పిండి వంటకాలు, నువ్వులతో కూడిన రొట్టెలు, అన్నిరకాల కూరగాయల వంటలు చేసుకుంటారు. రెండోరోజు మకర సంక్రాంతికి భక్షాలు, మాంసం వంటలు, కనుమ నాడు సైతం మాంసాన్ని వండుకుంటారు.

గంగిరెద్దులు ప్రత్యేకం

సంక్రాంతి పండుగ అంటేనే ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ఆటలు, చిన్నారులు పతంగులు ఎగురవేయడం ప్రత్యేకం. ఆంధ్రప్రదేశ్‌లో కోడి పందేలు చాలా ప్రత్యేకం. కానీ మన తెలంగాణలో మాత్రం గంగిరెద్దుల ఆటలే విశిష్టత సంతరించుకున్నాయి. పండగ పూట గంగిరెద్దు ఇంటిలోకి వస్తే మంచిదని భావించే రైతు కుటుంబాలు ధాన్యం, డబ్బులు దానంగా ఇస్తారు.



శతాధిక చెట్టు.. ఆనవాళ్లు చెదిరెట్టు

వందేళ్లుగా ఎంతో మందికి ప్రాణ వాయువును అందించిన వేపచెట్టు చిగురుటాకు అనేదే లేకుండా పూర్తిగా ఎండిపోయింది. తాండూరు పట్టణంలోని బస్వణ్ణ కట్ట సర్కిల్‌లో ఉన్న ఈ చెట్టు ఒకప్పుడు పచ్చదనంతో విరాజిల్లింది. దశాబ్దం క్రితం వరకు వృక్షం కింద రచ్చ కట్ట ఉండటంతో 24 గంటల పాటు నియోజకవర్గ ప్రజలు సేద తీరుతూ వచ్చారు. కాలుష్యమో, మరే ఇతర కారణాలతో ఈ వృక్షం మోడువారి దర్శనమిస్తోంది. ఎన్నో ఏళ్లుగా సేద తీర్చిన చెట్టు ఎండిపోవడంతో స్థానికులు, పర్యావరణ ప్రేమికులు కలవరపాటుకు గురవుతున్నారు. – తాండూరు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

తుర్కయంజాల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగితేనే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరని హైదరాబాద్ ఆర్చ్ బిషప్, తొలి తెలుగు కార్డినల్ పూల ఆంథోని అన్నారు. ఆదివారం పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని ఓ పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గ్యాస్ లీకై ఎగసిన మంటలు

హయత్‌నగర్: పండుగకు పిండివంటలు చేసేందుకు గ్యాస్ పొయ్యి వెలిగించగా...గ్యాస్ లీకై ఇల్లంతా మంటలు అంటుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు హయత్‌నగర్ ముదిరాజ్ బస్తీకి చెందిన కాశమోని రాంచందర్, కమలమ్మ దంపతులు పాత రోడ్డు సమీపంలోని ఓ పెంకుటింట్లో అద్దెకు ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం పిండి వంటలు చేసేందుకు గ్యాస్ స్టౌ వెలిగించారు. అప్పటికే గ్యాస్‌లీకై ఉండడంతో ఒక్కసారిగా మంటలు అంటుకుని ఎగసిపడ్డాయి. అప్రమత్తమైన రాంచందర్ ఇంట్లోని దుప్పట్లు తీసుకొచ్చి సిలిండర్‌పై వేసి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఇంట్లోని వారందరూ బయటకు వచ్చారు. ఫైర్ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చెరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



శివకుమార్ (ఫైల్)

రాజేంద్రనగర్: అర్ధ రాత్రి వేళ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి ప్రాంతానికి చెందిన శివకుమార్ (26) పాతనగరంలోని ఓ విద్యాసంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి 10 గంటలకు బుద్వేల్‌లో ఉండే స్నేహితుని ఇంటికి వెళ్తున్నానని చెప్పి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. రాత్రి వరకు స్నేహితుని ఇంట్లో ఉండి తిరిగి ఉప్పర్‌పల్లి వెళుతుండగా వెటర్నరీ కళాశాల సమీపంలో రోడ్డుపై ఉన్న డివైడర్‌ను ఢీకొని కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. శివకుమార్ బుద్వేల్‌లో ఎవరి ఇంటికి వచ్చాడు అనే వివరాలను సేకరిస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా శివకుమార్‌కు ఏడాది క్రితమే వివాహం అయింది.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో గురుకుల ప్రవేశ పరీక్షలకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయిస్తోందన్నారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం తనిఖీలు చేపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గురుకులాల ప్రిన్సిపాల్స్ థామస్‌రెడ్డి, రమణ, భాస్కర్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్, ఫైర్ సిబ్బంది



దగ్ధమైన గృహోపకరణాలు

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని గృహోపకరణాలన్నీ దగ్ధం

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ వై జంక్షన్ సమీపంలో ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సంఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. పోలీసులు, స్థానికులు తెల్పిన వివరాల ప్రకారం రాఘవేంద్ర అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తులోని ఫ్లాట్ నెం.307, 308ను కలిపి విశాలంగా ఒకే ఫ్లాట్‌గా నిర్మించారు. ఈ ఫ్లాట్‌లో కొత్త సూర్యనారాయణ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. సంక్రాంతి నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు ఇంటికి తాళం వేసి తమ సొంతూరు ఖమ్మం జిల్లా అశ్వరావుపేటకు బయలుదేరారు. దాదాపు 10 గంటల సమయంలో ఫ్లాట్ నుంచి దట్టమైన పొగలు, మంటలు రావడాన్ని గుర్తించి స్థానికులు వెంటనే ఫైరింజన్‌కు సమాచారం అందించారు. చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్, ముషీరాబాద్ ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ భానుప్రతాప్ తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లోని గృహోపకరణాలన్నీ దగ్ధమయ్యాయని, దాదాపు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్ట వాటిల్లిందని, ఫ్రిడ్జిలో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు తెలిపారు.

వీరత్వానికి ప్రతీక శివాజీ

హిందూవాహిని ధర్మ ప్రచారక్ డాక్టర్ ఆదిత్యపరాశ్రీస్వామి



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని హిందూవాహిని ధర్మ ప్రచారక్ డా.ఆదిత్యపరాశ్రీ స్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో శివాజీ హిందూ యువవాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముందుగా గ్రామంలో అంబేడ్కర్ చౌరస్తా నుంచి శివాజీ చౌక్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత శివాజీ అడుగుజాడల్లో నడవాలన్నారు. ప్రతి ఒక్కరూ సనాతన హిందూ ధర్మం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. యువత ఎంతో కష్టపడి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీజ్ఞానపీఠం హరిద్వారా జాతీయ ధర్మప్రచారక్ రఘునాథచారి, రాష్ట్ర హిందూ యువవాహిని కోకన్వీనర్ రాకేష్, నాయకులు వెంకట్రావు, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, వీరన్న, దస్తప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్నూరు కాపుల సమ్మేళనం

కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలకు చెందిన మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం పట్టణంలోని కేఎస్‌వీ(మురహరి) ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు సంఘం సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ, మండల, తాలూకా కమిటీల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర మహాసభ సభ్యులు, ట్రస్టు సభ్యులు, ఉమ్మడి పాలమూరు జిల్లా సంఘం బాధ్యులు, వికారాబాద్ జిల్లా సంఘం బాధ్యులు పాల్గొంటున్నారని తెలిపారు. వికారాబాద్, పాలమూరు జిల్లాల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన మున్నూరు కాపులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నూర్పిళ్లకు ఆలేడ్ బండే దిక్కు

దుద్యాల్: పంట ఏదైనా నూర్పిళ్లు చేయాలంటే కల్లానికి అనువైన స్థలం కావాలి. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనువైన స్థలాన్ని ఎంపిక చేయడానికి మల్లగుల్లాలు పడుతున్నారు. కానీ మండలంలోని ఆలేడ్ గ్రామ శివారులో ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి బండ పంట నూర్పిళ్లకు కేంద్రంగా మారింది. ఆలేడ్, హస్నాబాద్ గ్రామాలకు చెందిన రైతులు వివిధ రకాల పంటల నూర్పిళ్లను ఇక్కడే చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి వసతులు కల్పించాలని కోరుతున్నారు. వరి, కంది, జొన్న, పెసరు తదితర పంటలకు ఈ బండను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం కందుల నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి.



కందులను శుద్ధి చేస్తున్న రైతులు



కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఆడుకుంటున్న చిన్నారులు

ఆకట్టుకున్న ఆహ్లాదం

ధారూరు: పర్యాటక ప్రాంతమైన కోట్‌పల్లి ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం హైదరాబాద్ నుంచి వేలాది మంది పర్యాటకులు వచ్చి సేదా తీరారు. కుటుంబసభ్యులతో సరదాగా గడిపి వనభోజనాలు చేశారు. స్థానికంగా యువతీయువకులు బోటింగ్ చేసి ఎంజాయ్ చేశారు. ఈ సందర్భంగా స్వీయ చిత్రాలు తీసుకొని ఆనందాన్ని పంచుకున్నారు.



బోటింగ్ చేస్తున్న యువత

వైన్స్‌లో చోరీ

మద్యం బాటిళ్లు, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు



సీసీ కెమెరాల్లో రికార్డయిన దుండగులు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి దుండగులు రెచ్చిపోయారు. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. తాండూరు–సంగారెడ్డి ప్రధాన రోడ్డులో ఉన్న కనకదుర్గ వైన్స్ ఉంది. నిర్వాహకులు రాత్రి 10గంటలకు తాళం వేసి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం మద్యం దుకాణం తెరిచేందుకు రాగా షటర్ తాళాలు పగుల గొట్టినట్లు గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు చోరీ తీరును పరిశీలించారు. విలువైన మద్యం బాటిళ్లు, నగదు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు పోలీసులకు తెలిపారు. పోలీసుల విచారణలో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించగా ఇద్దరు దుండగులు చోరీ చేసినట్లు గమనించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రన్ ఫర్ యూత్



స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం హిందూ ధార్మిక పరిషత్ తాండూరు శాఖ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూత్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ నుంచి ఇందిరా చౌక్, వినాయక్ చౌక్ మీదుగా శాంతమహల్ చౌక్ వద్ద ఉన్న వివేకానందుడి విగ్రహం వరకు రన్ కొనసాగింది. పట్టణ వాసులు, యువత, హిందూ ధార్మిక పరిషత్ కమిటీ సభ్యులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్నారు. - తాండూరు టౌన్